## తెలంగాణ ప్రభుత్వ పాలనలో
# ప్రజా నిర్ణయాలే ఉంటాయి

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయి

ఈనెల 26 నుంచి ప్రజలకు మరింత సంక్షేమం అందుతుంది....

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



2లో...



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 21 | జనవరి | 2025 ◆ పేజీలు : 7



హెల్మెట్ భారం కాదు భరోసా

వినియోగం తప్పనిసరి అంటున్న పోలీసులు, రవాణాశాఖ

నిత్యం అవగాహన కార్యక్రమాలు

# నిర్లక్ష్యం చేస్తే...
# ప్రాణాలు బలి...

2లో..

◆ భద్రాచలం, ప్రజాజ్యోతి

ఉరుకులు.. పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేకపోవడంతో చాలామంది అక్కడికక్కడే మృతిచెందిన, గాయాలైన సందర్భాలు నిత్యం చూస్తూనే ఉన్నాం. హెల్మెట్ ఉంటే ఏమీ జరుగకుండా ఉండేది అనుకుంటామే తప్ప హెల్మెట్లు మాత్రం పెట్టుకోవడంలేదు. అవగాహన లేని వాహనదారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదని వాహనాల తయారీదారులు, రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నప్పటికీ గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ఆతృత తో హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హెల్మెట్ వాడకంపై ప్రజాజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం....



# గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలి...

ప్రజాభిప్రాయం మేరకు, ప్రజల సమ్మతితో గ్రామసభలు..

గ్రామ సభలలో సంక్షేమ పథకాలు అర్హుల పూర్తి జాబితా ప్రదర్శించాలి..

చిట్టచివరి అర్హుల వరకు సంక్షేమ పథకాలు అందాలి, ఇది నిరంతర ప్రక్రియ...

గ్రామ సభలలో సంక్షేమ పథకాల దరఖాస్తులు స్వీకరించడానికి ప్రత్యేకమైన కౌంటర్లు ఏర్పాటు చెయ్యాలి..

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

*కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 20, ప్రజాజ్యోతి*

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26 నుంచి అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా రేపటినుండి నుండి 24 వరకు నిర్వహించు గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు,

మిగతా 2లో...

## ఈ సంవత్సరం మార్చి నుంచి నైని బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తాం ...

గత సంవత్సరం జూలై 24న జరిగిన చర్చలు ఫలించాయి

విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు చర్యలు

నైని బొగ్గు బ్లాక్ దగ్గరే 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మిస్తాం

అవసరమైన స్థలాన్ని కేటాయించండి

ఒరిస్సా సీఎం మోహన్ చరణ్ మాంజితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



2లో...



ప్రజాజ్యోతి

గ్రామ కంఠంన్నే మింగిన...

భూ బకాసురులు

పేరుకు మాత్రం పంచాయతీకి చెందిన గ్రామ కంఠం భూమి ఇది. ఆ భూమిని ఎవరు పట్టించుకుంటారు లే అనుకొని ఆ పంచాయతీలో నివసిస్తున్న గిరిజనేతరులు గుట్టు చప్పుడు కాకుండా గ్రామ కంఠాన్ని మింగేసారు. లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల ఉమ్మడి పంచాయతీలో ఉన్న సర్వే నెంబర్లు 159,160 లలో ఉన్న ఎకరం పంచాయతీకి చెందిన గ్రామ కంఠం భూమిని కొందరు ప్రబుద్ధులు అమ్మేశారు.

# తీగ లాగితే...
# డొంక కదిలింది...

గ్రామకంఠం భూమిని మింగిన ఘటనపై విచారణ

రెవిన్యూ శాఖ పరిశీలన..

గృహ నిర్మాణాలు చేపడితే చర్యలు

జిల్లా కలెక్టర్ కు నివేదికను అందించనున్న రెవిన్యూ అధికారులు

*లక్ష్మీదేవిపల్లి, జనవరి 20 ప్రజాజ్యోతి:*

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ఉమ్మడి పంచాయతీ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 159,160 పంచాయతీకి చెందిన సుమారు ఎకరం గ్రామ కంఠం భూమిని మింగేశారు. లక్షలాది రూపాయలు పెట్టి కొనుక్కొన్న కొనుగోలు దారులు సైతం ఏకంగా గృహ నిర్మాణాలే చేపట్టారు. పెద్ద మొత్తంలో గిరిజనులు ఉంటున్న ఈ ప్రాంతంలో 1 / 70 చట్టాన్ని అబాసు పాలు చేసి ప్రభుద్దులు గుట్టు చప్పుడు కాకుండా మింగేశారు. సుమారు 40 కుంటలు ఉండాల్సిన గ్రామ కంఠం భూమి

## ప్రజాజ్యోతి ఎఫెక్ట్

అక్రమార్కుల కబంద హస్థాలలో ఉండిపోయి ప్రస్తుత్తం ఆరు కుంటల భూమినే మిగిల్చినారు. మిగితా 36 కుంటలు ఏమైనట్లు... ఎటుపోయినట్లు అనే విషయాన్ని ప్రజాజ్యోతి " గ్రామ కంఠాన్నే మింగిన భూ భకాసురులు " అనే కథనాన్ని ప్రచురితం చేసి సంబంధిత అధికారులను మేల్కొల్పింది. ఈ విషయంలో ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ

మిగతా 2లో...

## గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలి...

(మొదటి పేజీ తరువాయి...)

తాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు,ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు మరియు సంబంధిత అధికారులతో గ్రామ సభల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, గ్రామసభల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశంచేశారు. ఈసందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ రేపటినుండి నిర్వహించు గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణ ఈ వార్డులో ఏ రోజు గ్రామ సభలో నిర్వహించేది ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామసభల నిర్వహణకు టెంట్లు, మైక్ సెట్ లు, త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రజల సమ్మతితో గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామసభలు నిర్వహించు గ్రామపంచాయతీ సెక్రటరీలకు తగిన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలలో సంక్షేమ పథకాల పట్ల ప్రజల సందేహాలను అధికారులు నివృత్తి చేయాలన్నారు. గ్రామ సభలకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని, సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ పథకాల అర్హుల పూర్తి జాబితాను గ్రామ సభలలో ప్రదర్శించాలని అన్నారు. చాలా సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న రేషన్ కార్డ్ దరఖాస్తులు, ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా రేషన్ కార్డు లేని వారికి ప్రభుత్వమే కొత్త రేషన్ కార్డు మంజూరు చేయుటకు గాను విడుదల చేసిన అర్హుల జాబితాను గ్రామ సభలలో ప్రదర్శించాలన్నారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డు అందుతుందని, జాబితాలో పేరు రాని అర్హుల వద్దనుండి దరఖాస్తులను తీసుకునేందుకు వీలుగా గ్రామసభలలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ సేవకేంద్రాలలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న జాబితా మరియు మార్పులు చేర్పులు కోసం దరఖాస్తు చేసుకున్న జాబితాను కూడా గ్రామ సభలలో ప్రదర్శించాలన్నారు. చిట్ట చివరి అర్హుల వరకు సంక్షేమ పథకాలు అందేలా తగిన చర్యలు చేపట్టాలని, సంక్షేమ పథకాల అమలు అనేది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలలో నాలుగు సంక్షేమ పథకాలకు వచ్చినటువంటి దరఖాస్తుల వివరాలను, గ్రామసభ తీర్మానాలను నిర్దేశిత పట్టిక ద్వారా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈవో నాగలక్ష్మి , జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి, పిడి హౌసింగ్ శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఏవో రమాదేవి ,వ్యవసాయ శాఖ ఏ డి లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## తీగ లాగితే డొంక కదిలింది..

(మొదటి పేజీ తరువాయి...)

గ్రామ కంఠం భూమిని కాపాడలేని పరిస్థితిలో పంచాయతీ అధికారులు కాని రెవిన్యూ శాఖ అధికారులు కాని పట్టించుకోక పోవడంతో లక్షలాది రూపాయలు విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయింది. ఎట్టకేలకు సోమవారం సంబంధిత రెవిన్యూ శాఖ అధికారులు దృష్టిసారించారు. మండలానికి చెందిన రెవిన్యూ సర్వేయర్ ఆక్రమణకు గురైన గ్రామ కంఠం భూమిని పరిశీలించారు. గ్రామకంఠం భూమిలో అనుమతి లేకుండా ఎవరు గృహాలు నిర్మించుకోరాదని రెవిన్యూ చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏదైమైనప్పటికీ కబంద హస్తాలలో ఉన్న గ్రామకంఠం భూమి రెవిన్యూ అధికారుల చర్యలతో వెలుగులోకి వస్తుందా...? మరుగున పడుతుందా...? వేచి చూడాల్సి ఉంది.

# నిర్లక్ష్యం చేస్తే నిండు ప్రాణాలు బలి...

**భద్రాచలం, జనవరి 20 (ప్రజా జ్యోతి ):**

ఉరుకులు.. పరుగుల జీవితంలో వేగానికి ఉన్న ప్రాధాన్యత భద్రతకు ఇవ్వకపోవడంతో భారీ మూల్యం చెల్లించక తప్పడంలేదు. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేకపోవడంతో చాలామంది అక్కడికక్కడే మృతిచెందిన, గాయాలైన సందర్భాలు నిత్యం చూస్తూనే ఉన్నాం. హెల్మెట్ ఉంటే ఏమీ జరుగకుండా ఉండేది అనుకుంటామే తప్ప హెల్మెట్ ను మాత్రం పెట్టుకోవడం లేదు. అవగాహన లేని వాహనదారుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉండదని వాహనాల తయారీదారులు, రవాణావాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నప్పటికీ గమ్యానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. శరీరంలో అన్ని అవయవాల కంటే తలకు విశిష్టమైన స్థానం ఉన్న సంగతి తెలిసిందే. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మెదడుకు దెబ్బ తగిలినచోట ఉన్న మెదడు కణాలుగా పిలిచే న్యూరాన్లు నశిస్తాయి. దీనివల్ల అవయవాలు శాశ్వతంగా చచ్చుబడిపోతాయి. కాబట్టి తలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలని మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్లు చెబుతున్నాయి. దీని ప్రకారం ఎవరైనా హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధించే అవకాశాలున్నాయి. పదేపదే వాహనదారుడు హెల్మెట్ లేకుండా జరిమానా పడుతుంటే డ్రైవింగ్ లెసెన్స్ శాశ్వతంగా రద్దుచేసే అవకాశముంటుంది. యువత హెల్మెట్ పెట్టుకోవడాన్ని నామోషీగా ఫీలవుతూ.. రోడ్డు ప్రమాదాలకు గురై తమ నిండు ప్రాణాలను బలిచేసుకుంటున్నారు.

### నాణ్యతే కీలకం...

నాసిరకం హెల్మెట్ పెట్టుకుంటే ప్రమాద తీవ్రతను ఏమాత్రం తగ్గించలేవన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవడంతో హెల్మెట్ కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. హెల్మెట్ స్ట్రాప్ గడ్డంపై ఉంచేందుకు అనువుగా ఉండేలా ఎంపిక చేసుకోవాలి. తలకు ధరించినప్పుడు స్ట్రాప్ తీసుకునేందుకు, పెట్టుకునేందుకు వీలుగా ఉండాలి. ప్రధానంగా డిపార్ట్ మెంట్ ఆఫ్ ట్రాన్స్ పోర్టేషన్ ఐఎస్ ఐ అనుమతులు పొందిన కంపెనీల హెల్మెట్ లు ధరించాలని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు. హెల్మెట్ వాడటం వల్ల ప్రమాదాలు జరిగినా తలకు అయ్యే గాయాల తీవ్రతను తగ్గిస్తుంది. ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి 98 శాతం బయటపడొచ్చు. దుమ్ము, దూళి, ఎండ నుంచి రక్షణ కల్పిస్తుంది.

## భారం కాదు... బాధ్యతగా భావించాలి...

### –మధు ప్రసాద్ ట్రాఫిక్ ఎస్ఐ భద్రాచలం

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ను భారంగా కాకుండా బాధ్యతగా ధరించాలని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ అంటున్నారు. ప్రజా జ్యోతితో ముచ్చటించిన ఆయన హెల్మెట్ లేకుండా వచ్చే ద్విచక్ర వాహనదారుల వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసే అవకాశం లేదని అంతే కాకుండా రవాణా శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ సమయంలో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే మోటారు యాక్ట్ చట్టం కింద జరిమానా విధించటంతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తమని, భద్రాద్రి పట్టణంలో ఇప్పటికే పలుమార్లు హెల్మెట్ ధరించనివారికి అవగాహన కూడా కల్పిస్తున్నాం. హెల్మెట్ ధరించకుండా రోడ్లపై ప్రయాణం చేస్తే సహించేదిలేదని ఆయన తెలిపారు.




# ఈ సంవత్సరం మార్చి నుంచి నైని బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తాం

**కొత్తగూడెం సింగరేణి, జనవరి 20, ప్రజాజ్యోతి:**

నైని బొగ్గు గనుల ద్వారా ఈ సంవత్సరం మార్చి నుంచి బొగ్గు ఉత్పత్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఒరిస్సా రాష్ట్రంలోని కోణార్క్ లో జరుగుతున్న మూడవ జాతీయ మైనింగ్ మంత్రుల సదస్సు సందర్భంగా ఒరిస్సా రాష్ట్ర సీఎం మోహన్ చరణ్ మాంజీ తో డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు లేఖను అందజేశారు. ఒరిస్సా రాష్ట్రంలోని అంగూల్ జిల్లాలో నైని బొగ్గు గనిని స్థాపించేందుకు ఒరిస్సా సీఎం కార్యాలయం నుంచి అద్భుతమైన మద్దతు అందించినందుకు రాష్ట్ర ప్రభుత్వ పక్షాన కృతజ్ఞత తెలియజేస్తున్నానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేఖలో పేర్కొన్నారు. గత సంవత్సరం జూలై 24న మీతో జరిగిన సమావేశాన్ని ఎప్పటికీ మర్చిపోలేను, ఆ చర్చలు ఫలవంతం అయ్యాయని తెలిపారు. నైని క్యాప్టివ్ బ్లాక్ అయినందున బొగ్గు గని నుంచి ఉత్పత్తి చేసిన బొగ్గును తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్ లోని 800 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కు సరఫరా చేయాలి. జైపూర్ విద్యుత్ ప్లాంట్ నైనీ గని నుంచి దాదాపు 1000 కిలోమీటర్ల దూరంలో ఉంది, లాజిస్టిక్స్ లో చాలా ఇబ్బందులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణి ఒరిస్సాలోని నైనా బొగ్గు గని సమీపంలో పిట్ హెడ్ ఓవర్ ప్లాంట్ గా 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. దీని ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు, ఉత్పత్తి అయిన బొగ్గు లాభదాయకంగా ఉపయోగించే అవకాశం ఉంటుందని భావిస్తున్నామని ఒరిస్సా సీఎంకు అందించిన లేఖలో తెలిపారు. 20వ ఇపిఎస్ (ఎలక్ట్రికల్ పవర్ సర్వే) నివేదిక ప్రకారం రాబోయే మూడు దశాబ్దాల పాటు థర్మల్ విద్యుత్కు భారీ డిమాండ్ ఉంటుంది. ఈ నెల 5వ తేదీ న ఎంఓసి కార్యదర్శి రాసిన లేక ద్వారా గనులకు దగ్గరగా కొత్త థర్మల్ విద్యుత్ ప్లాంట్లను స్థాపించాల్సిన అవసరం ఉంది. రవాణా ఖర్చును తగ్గించడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి అంశాల నేపథ్యంలో గని నుంచి విద్యుత్తు ఉత్పత్తి లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి అధికారుల బృందం, ఒరిస్సా అధికారుల బృందంతో జరిగిన చర్చల్లో భాగంగా జరపాడ/తుకుడ & హండప్ప /బని నాలిని సైట్లు రెండు రాష్ట్రాలకు చాలా ప్రయోజనకరమైనవి, ఇవి ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు సానుకూల మౌలిక సదుపాయాల అభివృద్ధిని అందిస్తాయని తెలిపారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని నైని బొగ్గు గని సమీపంలో సింగరేణి ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టును స్థాపించడానికి తగిన భూమిని కేటాయించేందుకు, ఏర్పాట్లు చేసేందుకుకు సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరుతున్నట్టు డిప్యూటీ సీఎం చెప్పారు.

# తెలంగాణ ప్రభుత్వ పాలనలో ప్రజా నిర్ణయాలే ఉంటాయి

**అశ్వారావు పేట, జనవరి 20, ప్రజాజ్యోతి:**

తెలంగాణలో రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల ఆలోచనల మేరకు వారి నిర్ణయాల ప్రకారమే అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ అన్నారు. మండలంలోని మొద్దులమడ, కోయరంగాపురం గ్రామపంచాయతీలకు రూ . 40లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ కార్యాలయ భవనాలను ఎమ్మెల్యే జారె ప్రారంభించి ,పంచాయితీ కార్యదర్శులను సన్మానించారు. ఈ సందర్భంగా మొద్దులమడ గ్రామస్తులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రతి పేదవారికి చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈనెల 26 నుండి మరో నాలుగు ప్రజా సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెడుతుందన్నారు ఈ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి



విద్యను అందించడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా తను సంప్రదించవచ్చని అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూపల్లి రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు, పలువురు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు ఆహ్వానం



**ఇల్లందు, జనవరి 20, ప్రజాజ్యోతి:** 2025-26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలలో ఇంటర్ మెదటి సంవత్సరానికి అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ముదస్సర్ హుస్సేన్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం యంపిసి, బైపిసి ఇంగ్లీష్ మీడియంలో ముస్లిం, మైనారిటీ, ఎస్సి, ఎస్టి, బిసి, ఓసి విద్యార్థులకు పరిమిత సీట్లు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాల ధీటుగా అత్యుత్తమ ఫలితాలు అందిస్తు, అత్యున్నతమైన లెక్చరర్లతో ఉచితంగా ఈఏపిసెట్, నీట్, జెఈఈ మెయిన్స్, ఐఐటి కోచింగ్ ఇవ్వబడునని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకోని నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికహారం కోసం 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం, కాస్మోటిక్ చార్జీలు పెంచారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 28 వరకు www.tgmreistelangana.cgg.in వెబ్ సైట్ లో ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అదేవిదంగా నేరుగా మైనారిటీ గురుకుల కళాశాలలో సర్టిఫికెట్లు అందచేయాలని, విద్యార్థి ఆధార్ కార్డు, ఫోటో ఇవ్వాలని కోరారు. ఇంటర్ మొదటి సంవత్సరం యంపిసి, బైపిసిలలో 80 సీట్లకు గాను 60 ముస్లిమ్ మైనారిటీ, బీసీ-10, ఎస్సి-5, ఎస్టి-3, ఓసి -2 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ ముదస్సర్ హుస్సేన్, సెల్ :9666286874, పిడి నజీముద్దీన్ సెల్ :9866401175 లలో సంప్రదించాలని కోరారు.

# గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



**ఇల్లందు, జనవరి 20, ప్రజాజ్యోతి:** ఇల్లందు పట్టణంలోని జేబీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ బోధన ఉపాధ్యాయుడు రమేష్ (49) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. పాఠశాల విధులకు హాజరై, విద్యాబోధన చేస్తున్న క్రమంలో చాతిలో నొప్పి విపరీతంగా వచ్చి కుప్పకూలి పోయాడు. గమనించిన సిబ్బంది హుటాహుటిన 108 అంబులెన్స్ కు సమాచారం ఇచ్చి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రమేష్ పాఠశాలలోనే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. రమేష్ మృతి పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులు, ప్రగాఢ సంతాపం తెలిపారు. 2022 జనవరి నెలలో ఇల్లందు జెబిఎస్ పాఠశాలలో విధుల్లో చేరిన రమేష్ విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పడంలో ఎంతో ప్రావణ్యతతో బోడించేవాడని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. మృతుడు రమేష్ మహబూబాబాద్ స్వగ్రామం కావడంతో ఖమ్మం టీచర్స్ కాలనీలో నివాసం ఉంటూ ఇల్లందు జెబిఎస్ పాఠశాలలో పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

# కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి చాంద్ పాషా




**జూలూరుపాడు, జనవరి 20 ప్రజా జ్యోతి:** మండలంలో పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లుల తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ కార్యాలయం ముందు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎస్ కె. చాంద్ పాషా మాట్లాడుతూ కోడిగుడ్లను ప్రభుత్వం ఐదు రూపాయలు చెల్లిస్తుంటే మధ్యాహ్నం భోజన కార్మికులు ఎనిమిది రూపాయల కొనుగోలు చేసి వంట ఏజెన్సీ నిర్వహిస్తున్నారని నెలసరి వేతనాలు అందక బిల్లులు సకాలంలో రాక అప్పులతో ఏజెన్సీలు నిర్వహిస్తున్నారని పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి మెనూ చార్జీలు 25 రూపాయలు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నెలకు కనీస వేతనం పదివేల రూపాయలు ఇవ్వాలని , పెండింగ్లో ఉన్న కోడిగుడ్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద భీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని కోరారు .గత పాలకులు లాగా కాకుండా మధ్యాహ్నం భోజన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ముదిగొండ లక్ష్మి, గడల మంగమ్మ, సత్యవతి రజిని పద్మ సుశీల రాణి సుభద్ర నిర్మల లలిత, తదితరులు పాల్గొన్నారు.

# ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

## కాంగ్రెస్ నాయకులను నిలదీసి అడగాలి: బారాస



**టేకులపల్లి, జనవరి 20, ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరమైన వారు చేసిన పనులు ఏమిలేవని ఇచ్చిన మాట తప్పడం తప్ప అని టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగ కాంతారావు, మాజీ ఎమ్మెల్యే హరి ప్రియ నాయకులు అన్నారు. సోమవారం టేకులపల్లి మండల కేంద్రం వెంకట్యా తండా సమీపాన టిఆర్ఎస్ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం లక్కినేని సురేందర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రేగ కాంతారావు, హరిప్రియ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆచరణ సాధ్యం కానీ హామీలను ప్రజలకు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ నిలదీయాలని అన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరమైన ప్రజలకు చేసిన సంక్షేమ పనులు ఏమి లేవని, గతంలో టిఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమ పథకాలన్నీ టిని చేరకుండా అడ్డుకొని రాష్ట్రంలో ప్రజలను నానా ఇబ్బందులు పెడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు స్థానిక సంస్థ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. మళ్లీ ఎలక్షన్ ముందే గ్రామాల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులకు వచ్చినప్పుడు కెసిఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాల అమలుకు నోచుకోలేదు అని వారిని అడిగి నిలదీయండి అని, గత ప్రభుత్వం చేసిన పనులను ఇప్పుడు ప్రభుత్వం చేయలేకపోతున్నాను పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాలు కావాలంటే లీడర్లు దుకాణాలు ప్రారంభించి వసూలు చేస్తున్నారు. అతి కార్యకర్తకు అండగా ఉంటాం. టేకులపల్లి మండలంలో ఉన్న 36 గ్రామపంచాయతీ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిపించుకోవాలి, అలాగే వెళ్ళింది నియోజకవర్గంలో ఉన్న 138 గ్రామపంచాయతీలను టిఆర్ఎస్ పార్టీ గెలిపి లక్ష్యంగా పనిచేయాలని, గ్రామాల్లో తిరిగి ఓట్ అడిగే ధైర్యం కాంగ్రెస్ పార్టీ వాళ్లకు లేదని, గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ గెలిపించండి కెసిఆర్ కి కానుకగా ఇద్దామని కోరారు. ఈ కార్యక్రమం టిఆర్ఎస్ సీనియర్ నాయకులు దిండిగల రాజేందర్, డిసిసిబి డైరెక్టర్ లక్కీనేని సురేందర్రావు, మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, బయ్యారం మండల అధ్యక్షుడు తాత గణేష్, కామేపల్లి మండల అధ్యక్షుడు అచ్చయ్య, టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్, లాల్ చందు, కిషన్, రామ, భూక్య లాలునాయక్, రవి, పూల్ సింగ్, చీమలసత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు టిప్పర్ డ్రైవర్లకు లాభాల్లో వాటా ఇవ్వాలి - టియుసిఐ

## ముఖ్యమంత్రి హామీ ప్రకారం ఆటో జీప్ క్యాబ్, డ్రైవర్లకు 12 వేల రూపాయలు ఇవ్వాలి

## జెండా ఆవిష్కరించిన రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న




**టేకులపల్లి, జనవరి 20, ప్రజాజ్యోతి:** ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ టియుసిఐ జిల్లా ప్రథమ మహాసభ టేకులపల్లి సేవాలాల్ గుడి వద్ద జర్పుల సుందర్ అధ్యక్షతన మహాసభను నిర్వహించారు. ఈ మహాసభలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం పాల్గొని మాట్లాడుతూ ఈ దేశంలో పనిచేస్తున్నటువంటి ఆటో మోటార్ జీప్, క్యాబ్ టాక్సీ మ్యాజిక్ తదితర రంగాల డ్రైవర్లు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని వారు. అన్నారు. ప్రభుత్వాలు గద్దెనెక్కేముందు అనేక వాగ్దానాలు చేస్తున్నారన్నారు. గద్దెనెక్కిన తర్వాత ఎవరు కార్మికులు ప్రజలు కోసం మాట్లాడేటటువంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్ సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. డ్రైవర్ల పోరాటాలకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అండగా ఉంటుందని అన్నారు. టియుసిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి పాల్గొని మాట్లాడుతూ ఆటో మోటార్ రంగాలు మహిళలకు ఉచిత బస్ ప్రయాణం వల్ల ఆటో క్యాబ్ జీప్ మోటార్ తదితర రంగాలు ప్యాసింజర్ ఎక్కక డ్రైవర్ల కుటుంబాలు పస్తులు ఉంటు న్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి హామీ ప్రకారం డ్రైవర్లకు ప్రకటించిన 12,000 వేల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సభ ప్రారంభానికి ముందు యూనియన్ జెండాను పాయం వెంకన్న ఆవిష్కరించారు. టియుసిఐ జిల్లా ఆఫీస్ బేరర్స్, గోనెల రమేష్, గోపాల రావు, పి సతీష్ జిల్లా నాయకులు చంద్రశేఖర్ వేల్పుల రమేష్, పిల్లి రాజేష్ దనసరి రాజేష్, టేకులపల్లి బ్రాంచ్ కార్యదర్శి గుగులోత్ మదర్ సీనియర్ డ్రైవర్ రంగా రావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రయాణాలు చేసేటప్పుడు నిర్లక్ష్యం వీడండి - ఎస్ఐ రవి

## మండల కేంద్రంలో ర్యాలీ మానవహారం




**జూలూరుపాడు, జనవరి 20 ప్రజా జ్యోతి:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో సోమవారం జూలూరుపాడు పోలీసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేగం వద్దు నియంత్రణే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం మండల కేంద్రంలో మానవహారం నిర్వహించి ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో కృషి చేయాలన్నారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా వాహనాలకు వ్యక్తులకు ఇన్సూరెన్స్ ఉండాలని యూటర్న్ తీసుకునేటప్పుడు తప్పనిసరిగా ఇండికేటర్లను ఉపయోగించాలని హెల్మెట్లు ధరించాలని వాహనాలను వేగంగా నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడపడంతో యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు హైస్కూల్ హెడ్మాస్టర్ వెంకట్ నర్సయ్య, ఉపాధ్యాయులు , ఫారెస్ట్ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జియం

**ఇల్లందు, జనవరి 20, ప్రజాజ్యోతి:** 76వ గణతంత్ర దినోత్సవాల స్థానిక 24 ఏరియాలోని రన్స్ అండ్ గోల్డ్ స్టేడియంలో జరిగే ఏర్పాట్లను సోమవారం ఏరియా జియం వీసం కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలైన జాతీయ జెండా ఆవిష్కరణ, సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, సాంస్కృతిక కార్యకలాపాలకు వచ్చే ఇల్లందు ఏరియా ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, వివిధ స్కూల్ నుండి వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జియం బొల్లం వెంకటేశ్వర్లు, డిజియం (పర్సనల్) జివి. మోహన్ రావు, ఎస్ సి (సివిల్) వెంకటేశం, అధికారులు అంజి రెడ్డి, పవన్ కుమార్ పాల్గొన్నారు.



# పర్యాటక కేంద్రంగా పూబల్లి

**ఇల్లందు, జనవరి 20, ప్రజాజ్యోతి:**

పర్యాటక కేంద్రంగా పూబల్లి నిలువనుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. సోమవారం పూబల్లి గ్రామంలో పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువు సమీపంలో జామాయిల్ కర్రలతో ఫెన్సింగ్, టాయిలెట్స్ నిర్మాణం, జిఐ రేకులతో పైకప్పు నిర్మాణం, సోలార్ లైటింగ్, టెంట్ నిర్మాణం చెరువు సమీప ప్రాంతం రోడ్డు ఇరువైపులా ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా సందర్శకులకు గిరిజన వంటకాలు, నాటు కోడి పులుసు, జొన్న రొట్టెలు, బొద్దుకూర, లోకల్ వంటకాలను మహిళా సంఘ సభ్యులు తయారు చేయాలని సూచించారు. ఆర్గానిక్ ఫార్మింగ్ కూరగాయల సాగు పెరటి కోళ్ల పెంపకం, స్వచ్ఛమైన పాలు, గిరిజన ఉత్పత్తులు తేనే అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసే విధంగా ప్రణాళిక చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ అభిప్రాయం, సలహాలు, సూచనలు ప్రస్తావిస్తూ చెరువులో బోటింగ్ పక్కనే ఉన్న కొండలను ట్రెక్కింగ్, దండ గుండాల సమీపంలో సెలయేరు చూడడం, దండ గుండాల, పూబెల్లి, ధర్మపురం పరిసరాల్లో అటవీ పర్యావరణ అందాలను తిలకించటం, సెల్ఫీ పాయింట్, వాచ్ టవర్ ఏర్పాటు, పొలం మంచ, పశువుల షెడ్డు, రాత్రిపూట టెంట్ ల వద్ద క్యాంపైర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దన్ సింగ్, ఎంపిఓ చిరంజీవి, ఎంఎల్ఏ పిఏ రాజేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, గ్రామ సంఘం అధ్యక్షురాలు కృష్ణవేణి, మాజీ యంపిపి మండల రాము, నాయకులు ధనుంజయ్, నరసింహారావు, బక్కయ్య, పర్యాటక టీమ్ సభ్యులు కృష్ణవేణి, ఉమారాణి, శ్రీకాంత్, నవీన్, ముత్యాలు, కిరణ్, బాయమ్మ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అర్హుల ఎంపిక జరగకుంటే గ్రామ సభలను అడ్డుకుంటాం

### సిపిఐ జిల్లా నాయకులు చంద్ర నరేంద్ర కుమార్

**జూలూరుపాడు, జనవరి 20 ప్రజా జ్యోతి:**

జులూరుపాడు మండలంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే గ్రామ సభల్లో నిజమైన అర్హుల ఎంపిక జరగకుంటే గ్రామ సభలను అడ్డుకుంటామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ హెచ్చరించారు . సోమవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు . వారు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్లు పథకాలలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల సమక్షంలో ఆయా గ్రామ పంచాయతీలలో గ్రామసభలు ద్వారా అర్హుల జాబితా ఎంపిక చేయనున్నట్లు ఇప్పటికే అధికారులు తెలిపారన్నారు. ప్రభుత్వ పథకాలు నిజమైన అర్హులకే దక్కాలని, అటుగా ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ కమిటీలు కృషి చేయాలని కోరారు. గ్రామ సభలలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలు పనిచేయాలే తప్ప, గ్రామ కాంగ్రెస్ కమిటీల వ్యవహరించకూడదని హితవు పలికారు. అధికార యంత్రాంగం నిజమైన నిరుపేదలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని , లేనిపక్షంలో గ్రామ సభలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కె.నాగుల్ మీరా, సిపిఐ నాయకులు, ఎల్లంకి మధు, ఎస్ కె .చాంద్ పాషా, గుడిమెట్ల సీతయ్య, యాస రోశయ్య, సోబ్బెన సూర్యం చెరుకుమల్ల రాజేశ్వరరావు, చిమట ముత్తయ్య పొన్నెకంటి వెంకటేశ్వర్లు, వల్ల మల్ల సామేలు హలవత్ బద్రు బడుగు వీరస్వామి, పాలెపు ప్రభాకర్, పత్తిపాటి మహేష్, కొండా హనుమంతరావు, చెరుకుమల్ల రామకృష్ణ, ఎల్లంకి శ్రీను, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# డీసీఎంస్ ద్వారా నేటి వరకు 3,50,000 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోళ్లు

**పాల్వంచ, జనవారి 20 (ప్రజా జ్యోతి ):**

జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ శాఖా (డీసీఎంస్ ) ద్వారా నేటి వరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 99 కోట్ల విలువ గల 3,50,000 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డీసీఎంస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు అన్నారు, ఖమ్మంలోని డీసీఎంస్ కార్యాలయంలో సోమవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు, కొత్వాల మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 29 సెంటర్ల ద్వారా 2.56 లక్షల క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలోని 11 సెంటర్ల ద్వారా 94 వేల క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని డీసీఎంస్ ద్వారా నిర్వహించే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు త్వరలో కొనుగోలు కేంద్రాలను నిలిపివేయనున్నామన్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్ల రైతులు డీసీఎంస్ ద్వారా నిర్వహించే కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల కోరారు, ఈ సమావేశంలో పాలకవర్గం సభ్యులు పరుచూరి రవి కుమార్, జక్కుల లక్ష్మయ్య, కుంచపు వెంకటేశ్వర్లు, తోళ్ల కోటయ్య, మారుతీ ఏటయ్య, డీసీఎంస్ బిజినెస్ మేనేజర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రధానోపాధ్యాయులు రాములు గారిపై దాడి చేసిన దుండగులను వెంటనే కఠినం గా శిక్షించాలి

**చుంచుపల్లి, జనవరి 20, ప్రజా జ్యోతి :**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ప్రధానోపాధ్యాయులు రాములు గారిపై జరిగిన దాడికి నిరసన గా AHS సర్వారం, (సుజాత నగర్ మండలం )పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జి లను ధరించి మధ్యాహ్నభోజన సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా TPTF జిల్లా కార్యదర్శి బానోత్.రమేష్ గారు మాట్లాడుతు HM రాములు గారిపై దాడి చేసినా వ్యక్తులను వెంటనే కఠినంగా శిక్షించాలని, పాఠశాల నిర్వహణ సమయంలో ఉపాధ్యాయులపై ఎవరు దాడి చేసినా వారిపై కఠిన చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నెల రోజులు గడుస్తున్న నేటి వరుకు నిందితుపై ఎటువంటి కేసులు నమోదు చేయకపోవడం శోచనియమని, వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో TPTF మండల ప్రధాన కార్యదర్శి తారసింగ్ గారు, పద్మ గారు, PD సైదులు గారు, నాగు గారు, వీరభద్రమ్మ గారు, రమణమ్మ గారు, శారద గారు, అప్పారావు గారు, లచ్య గారు, రవికుమార్ గారు, ఉష గారు పాల్గొన్నారు



## ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా నియమాలను పాటించాలి



**భద్రాచలం టౌన్, జనవరి 20 ప్రజాజ్యోతి:**

ప్రతి ఒక్కరూ ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా నియమాలను పాటించాలని ఎంవిఐ సంఘం వెంకట పుల్లయ్య అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలం రవాణా శాఖ యూనిట్ ఆఫీస్ భద్రాచలం కార్యాలయంలో. లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్, ఆటో రిజిస్ట్రేషన్ మరియు ఫిట్నెస్‌కు వచ్చిన వాహనదారులకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై రవాణా శాఖ అధికారి సంఘం వెంకట పుల్లయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించడం, వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించడం, వాహనాలను ఓవర్టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, సీటు బెల్ట్ డ్రైవింగ్, మూల మలుపుల వద్ద నిదానంగా వెళ్లడం హారన్ కొట్టడం రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కాగా పాటించవలసిన అంశాలు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు ముందురోజు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలంలలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వాహనదారులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ సంఘం వెంకట పుల్లయ్య అన్నారు .

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



**భద్రాచలం టౌన్, జనవరి 20 ప్రజాజ్యోతి:**

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రజలు, విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని భద్రాచలం టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఎస్ఐ విజయలక్ష్మి తమ సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం, బైక్ పైన స్టంట్ లువంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. ఈ విషయాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాటు ఇతరులకు కూడా అర్థమయ్యేలా చెప్పాలని టౌన్ ఎస్ ఐ విజయలక్ష్మి సూచించారు. విద్యార్థినులు సెల్ ఫోన్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సమాచారాన్ని ఎంత వరకు మాధ్యమాల్లో షేర్ చెయ్యాలి లిమిటేషన్స్, డిజిటల్ అరెస్టు గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐ విజయ లక్ష్మి, సిబ్బందితో పాటుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

**భద్రాచలం, జనవరి 20 (ప్రజాజ్యోతి ):**



భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలో మూలవరులకు హైదరాబాద్ కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణం నిర్వహించారు.

## రామదాసు మండపంలో రాపత్తు సేవలు





*భద్రాచలం, జనవరి 20 (ప్రజాజ్యోతి ):*

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాపత్తు సేవలు సోమవారంతో ముగిసాయి. చివరి రోజున యుబి రోడ్డు లోని తహసీల్దారు నివాసం వద్ద ఉన్న రామదాసు మండపంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి రాపత్తు సేవ నిర్వహించారు. ముందుగా స్వామి వారిని అందంగా అలంకరించి మేళతాళాలు, భాజాభజంత్రీల నడుమ తహసీల్దారు శ్రీనివాస రావు ఆధ్వర్యంలో రెవిన్యూ అధికారులు స్వామి వారిని మండపానికి తీసుకొచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారినిదర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## రొంపేడులో సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టాలి



*ఇల్లందు, జనవరి 20, ప్రజాజ్యోతి:*

తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకులాల నిర్మాణాలను రొంపేడులోని 309సర్వే నెంబర్ లో గల 25నుండి 30ఎకరాల ప్రభుత్వ భూమిలో చేపట్టాలని సేవాలాల్ సేన మండల యువజన అధ్యక్షుడు భూక్య సురేష్ నాయక్ కోరారు. సోమవారం ఇల్లందు తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లందు మండల పరిధిలో సమీకృత గురుకులం ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం, ప్రభుత్వ భూమి కొరకు వెతుకుతున్న సంగతి సేవాలాల్ సేన దృష్టికి వచ్చిందన్నారు. ఆ భూమిలో సమీకృత గురుకులాల కొరకు ఉపయోగిస్తే ఈ ప్రాంతంలో ఉన్న దళిత, గిరిజన, మైనారిటీ, బిసి లకు చెందిన విద్యార్థులకు గొప్ప చదువులు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన ఇల్లందు మండల కన్వీనర్ ఆంగోత్, ఆంజనేయులు, నాయకులు రాందాస్ నాయక్, భూక్యా వీరు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు

*టేకులపల్లి, జనవరి 20,ప్రజాజ్యోతి :*



ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ప్రతిరోజు ఉదయం 9గంటల మంచి మధ్యాహ్నం వరకు అన్ని గ్రామాలలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో ఏర్పాటుచేసిన పత్రిక విలేకరుల సమావేశంలో ఎమ్మార్వో నాగబావని తెలిపారు.ఆయా తేదీలలో జరిగే గ్రామసభలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ రేషన్ కార్డుల వివరాలు గ్రామ సభ ముందు ఉంచబడతాయనీ, ఎవరైనా ఏ పథకం కోసమైనా లబ్ధి చేకూరడం కోసం దరఖాస్తు చేసుకోవాలని భావిస్తే, వారు గ్రామసభ లోనే ప్రత్యేకంగా ఏర్పరిచిన కౌంటర్లలో వారి దరఖాస్తులు ఇచ్చి రసీదు తీసుకోవాలని వారు తెలిపారు.

## ఏరియా వైద్యశాల పారిశుధ్య కార్మికులకు వేతనాలు విడుదల చేయాలి

**– ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేత**



*భద్రాచలం టౌన్, జనవరి 20 (ప్రజాజ్యోతి )*

భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య, పేషంట్ కి సెక్యూరిటీ ఇతర విభాగాల్లో పని చేసే కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు తక్షణమే ఎండింగులో ఉన్న ఐదు నెలల వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం సీఐటీయు ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ అనుపత్రిలో కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతూ అనేకమార్లు సూపరింటిండెంట్, డీసీహెచ్ఎస్, పీవో, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పండుగ పూట కూ డా పస్తులు ఉండాల్సిన పరిస్థితి కాంట్రాక్టర్ కల్పించారని ఆరోపించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గొప్పలు చెబుతూ అన్ని సమస్యలకు మేము పరిష్కారం చేస్తామని అందరి బకాయిలకు మేము డబ్బులు చెల్లిస్తామని బూటకపు వాగ్దా నాలు చేస్తూ కార్మికులను సంచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు నాగరాజు, ఆసుపత్రి యూనియన్ కార్మికులు రమ, వెంకట రమణ , కుమారి, సరిత, మెహబూబ్, రమణ, కుమారిలు పాల్గొన్నారు.

# లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ వినియోగించుకోండి

**–టీఎస్ జిఆర్ఏ అధ్యక్షులు జి. భూషణరావు**



*భద్రాచలం టౌన్, జనవరి 20(ప్రజాజ్యోతి )*

తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ వినియోగించుకోవాలని టీఎస్ జిఆర్ఏ అధ్యక్షులు జి. భూషణరావు తెలియజేశారు ఈ సందర్భంగా సోమవారం భద్రాచలం పెన్షనర్లభవన్ నందు తెలంగాణరాష్ట్రవిశ్రాంత ఉద్యోగుల సంఘం, భద్రాచలం యూనిట్ వారు లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సర్టిఫికెట్ డిజిటల్ విధానం ద్వారా ఫేస్ మరియు బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ విధానంలో మీసేవ టిఎఫ్ పోలియో, జీవన ప్రమాణం ద్వారా సదరు పెన్షనర్ దారులకు లైఫ్ సర్టిఫికెట్ అందించడం జరుగుతుందని, క్యాంపు సుమారు జనవరి 31 వరకు కార్యాలయం నందు ప్రతిరోజు పది గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించబడునని పెన్షనర్ దారులు ఈ క్యాంపు ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతేకాక సదరు పెన్షన్దారులు ఎవరైనా అనారోగ్యంగా ఉండి కదలలేని పరిస్థితుల్లో ఉంటే వారి వివరాలు సంఘం వారికి తెలిపినట్లయితే లైఫ్ సర్టిఫికెట్ అథెంటిఫికేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జిఆర్ఏ కార్యదర్శి జి వెంకన్న, కోశాధికారి ఎస్ హనుమంతరావు,.ఉపాధ్యక్షులు రామచంద్రరావు, జీవి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె మాణిక్య కుమారి, పబ్లిసిటీ సెక్రెటరీ జి. తులసి దాస్ శేఖర్ గారు, సిహెచ్ నరసింహులు, పెన్షన్ దారులు పాల్గొన్నారు .

## ఆదివాసీ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ , మహాధర్నా






*భద్రాచలం టౌన్, జనవరి 20 (ప్రజాజ్యోతి ):*

రాష్ట్రంలో జీవో నెంబర్ 3 దాని అనుబంధ జీవోలను కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్లతో చట్టం తేవాలని ఆదివాసీ పరిషత్ జాతి అధ్యక్షులు దాట్ల నాగేశ్వరరావు అన్నారు. భద్రాచలంలో సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ, మహా ధర్నా నిర్వహించారు. ముందుగా ర్యాలీ స్థానిక బ్రిడ్జి సెంటర్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు చేరుకుంది. అనంతరం ఐటీడీఏ పీవో రాహుల్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐటీడీఏ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పరిషత్ జాతి అధ్యక్షులు దాట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏకలవ్య మోడల్ స్కూల్స్ లలో 30 శాతం ఆదివాసీ విద్యార్థులతో భర్తీ చేయాలన్నారు. ఆదివాసీలు సాగు చేస్తున్న భూముల్లో ఉచిత బోర్ వెల్స్, కరెంటు సబ్సిడీ కల్పించి వారిని ఆర్థికంగా అదుకోవాలని డిమాంగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం రామ రాజు, కోశాధికారి కొర్సా వెంకటేశ్వరు, జాయింట్ కార్యదర్శి ఈసాల సురేష్, రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ఏటీఏ అధ్యక్షులు కల్లూరి జయబాబు, కార్యదర్శి వం వీరస్వామి, ఎస్ .సత్యనారాయణ, నాగబోయిన చంద్రయ్య దొర, సోయం మల్లుదొర, కుంజ చినబాబు, తుర్చం రవి, బాగబోయిన శ్రీను, సనప గోవర్ధన్, బట్టి కనకరాజు, పూషం రమణబాబు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి - ఎస్సై పి.శ్రీకాంత్

*టేకులపల్లి, జనవరి 20,ప్రజాజ్యోతి :*

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని మండల ఎస్సై పి. శ్రీకాంత్ అన్నారు. కోయగూడెం ఓసి నందు రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ వాహనాలను నడిపే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారిని అభినందించాలన్నారు. మూడు రోజుల తర్వాత హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిం చాలన్నారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్దదిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. కాబట్టి వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. టిప్పర్ ,లారీ డ్రైవర్ లందరికీ వెహికల్ ఓవర్ లోడింగ్, ఓవర్ స్పీడింగ్ , డ్రంక్ అండ్ డ్రైవ్ , ట్రాఫిక్ రూల్స్ , రోడ్డు భద్రత కు సంబంధించిన వంటి విషయాలపై డ్రైవర్ లందరికీ అవగాహన చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్, లారీ డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

## వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించాలి

### భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలం... జనార్దన్ రెడ్డి.. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్




**అశ్వారావు పేట, జనవరి 20, ప్రజాజ్యోతి:** భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలమని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జనార్ధన్ రెడ్డి అన్నారు. జనవరి 01 నుంచి 31 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని డ్రైవర్లకు, వాహనదారులకు రవాణా శాఖ చెక్పోస్ట్ వద్ద రోడ్డు భద్రత చర్యలు నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. కాబట్టి వాహనం నడిపేట ప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు. ఈ విషయాలను ప్రతి వాహనదారులు గమనించాలన్నారు. రాత్రి వేళల్లో జరిగే ప్రమాదాల్లో వాహనాలకు రేడియం స్టిక్కర్ లేకపోవడమే ప్రధాన కారణం అని అందువలన ప్రతి వాహనానికి రేడియం స్టిక్కర్ అతికించడం ద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉందన్నారు. రేడియం స్టిక్కర్లను పలు వాహనాలకు జనార్దన్ రెడ్డి స్వయంగా తన సిబ్బందితో కలిసి అంటించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్ కుమార్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడుపై దాడికి నల్ల బ్యాడ్జీలతో నిరసన



**టేకులపల్లి, జనవరి 20, ప్రజాజ్యోతి:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రాములుపై జరిగిన దాడికి నిరసనగా రాష్ట్రంలో అన్ని ఉపాధ్యాయ సంఘాల పక్షాన సోమవారం జడ్పీహెచ్ఎస్ సులానగర్ పాఠశాల నందు నల్ల బ్యాడ్జీలు ధరించినిరసన తెలియజేచారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్గదర్శకులుగా ఉంటారని విద్యార్థులకు విద్యాభివృద్ధిలో కృషి చేస్తూ ఉంటారని, సమాజంలోని రుగ్మతలను నిర్మూలించుటలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని తెలిపారు. కానీ కొందరు ఉపాధ్యాయులను మానసికంగా వేధించటం శారీరకంగా హింసించడం సరి అయింది కాదని, శ్రీ రాములు పై జరిగిన దాడిని పూర్తిగా ఖండిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు జిల్లా ఉపాధ్యక్షులు టీ .రవీందర్ టేకులపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.మోతిలాల్ ,బి. రమేష్ బాబు,మండల ఉపాధ్యక్షులు ఎం. రమణ ,నాయకులు సిహెచ్ మురళీధర్ రావు,వెంకట్ రెడ్డి ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదాసు,ఏం.బాలు ,స్వరూప,దీప,శ్రీ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఏఎస్ఐగా మోతుకూరి శంకర్



**భద్రాచలం, జనవరి 20 (ప్రజా జ్యోతి ):** భద్రాచలం ట్రాఫిక్ ఏఎస్ఐ గా మోతుకూరు శంకర్ ను నియమించారు. భద్రాచలం ట్రాఫిక్ స్టేషన్ నందు హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న శంకర్ ఇటీవల ప్రమోషన్లో భాగంగా పదోన్నతి పొందారు. దీంతో సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. మోతుకూరు శంకర్ గతంలో పట్టణ పోలీస్ స్టేషన్లో పనిచేశారు. విధి నిర్వహణ లో అంకితభావంతో పని చేస్తాడని, సౌమ్యుడగా , వివాదరహితుడిగా మంచి పేరు ఉండడంతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందే ఎయస్ఐ గా నియమించారు .దింతో శంకర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు బాధ్యతలు స్వీకరించారు

# కన్న కూతురినే కడతేర్చాలని చూసిన తండ్రి



**టేకులపల్లి, జనవరి 20, ప్రజాజ్యోతి:** కన్నతండ్రే కూతురినే కడతేర్చాలని చూసిన ఘటన మండలంలోని సంపత్ నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. బోడు ఎస్సై పి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గంగారం పంచాయతీ సంపత్ నగర్ గ్రామంలో నివాసముంటున్న కొరస లక్ష్మి భర్త రవి కొన్ని రోజులుగా కుటుంబంలో అనునిత్యం గొడవలతో రోజులు గడుపుతున్నారని తెలిపారు. ఇలా గొడవలతో విడిపోయిన వీరుని గ్రామంలోని పెద్దమనుషులు పంచాయతీ పెట్టి వారిద్దరిని ఒకటి చేశారు. అలా కొన్ని రోజులు మంచిగా ఉండి మళ్లీ భార్యాభర్తలు గొడవపడి కొరస రవి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చి ఇంటి బయట ఆడుకుంటున్న తన మూడవ కూతురు అయినా కొరస సాహిత్య చాక్లెట్ కి ఇస్తానని పక్కనే ఉన్నటువంటి జమాల్ తోటలోకి తీసుకువెళ్లి తన వద్ద ఉన్న కండవతో పాపకు గట్టిగా నులమగా సాహిత్య స్పృహ కోల్పోవడం వలన చనిపోయిందని భావించి అక్కడే వదిలేసి కొరస రవి పారిపోయాడు. కొద్దిసమయం సాహిత్య స్పృహలోకి వచ్చి ఏడ్చుకుంటూ తన తల్లి దగ్గరికి వెళ్ళి జరిగిన విషయం తెలపగా కొరస లక్ష్మీ బోడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. కొరస లక్ష్మి ఫిర్యాదు మేరకు బోడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి నిందితుడి గాలింపు చర్యలు ముమ్మరంగా చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.